## పనుల్లో నాణ్యత తప్పనిసరి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అన్నారు. మంగళవారం కన్నాయిగూడెం మండలంలోని సింగారం, ఏటూరు, కంతనపల్లి గ్రామాలలోని పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పి శ్రీజ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తరగతి గదుల్లోని లైట్‌లు, ఫ్యాన్‌ల నిర్వహణను పర్యవేక్షించారు. మరుగుదొడ్లను పరిశీలించి, వాటిపై రూఫ్‌ను, తలుపుల మరమ్మత్తులను సరైన విధంగా అమర్చాలని సిబ్బందిని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల వాతావరణం ఒక నూతన అనుభూతిని కలిగించే విధంగా పాఠశాల పరిసరాలను ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల ప్రత్యేక అధికారి ఏపిడి వెంకటనారాయణ, ఎంపిడిఓ, ఎంఈఓ రాజేష్, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపివో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మంగళవారం సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా గుర్తించిన పనులను పరిశీలించారు. తరగతి గదుల్లోని లైట్‌లు,ప్యాన్‌ల నిర్వాహణను పర్యవేక్షించారు. మరుగుదొడ్లు పరిశీలించి వాటిపైరూఫ్‌ను వేయాలని, తలుపులు అమర్చాలని ఆదేశించారు. తాగు నీరు, ప్రహరీగోడ గేటు, మౌళిక వసతులపై అడిగి తెలుసుకున్నారు.

## ఎంపిపి కార్యాలయంలో తనిఖీ



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మెదక్ జిల్లా అల్లాదుర్గం అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీ ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఎంపీడీవో కే.శంకర్, జూనియర్ సహాయకులు ఎండి.సజ్జాద్ అలీ సిబ్బంది ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై ఆరా



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపి, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీవో రాజేందర్ రెడ్డి, డీసీఎస్‌వో రోజారాణి, సివిల్ సప్లై డీఎం ప్రసాద్, డీఏవో వినోద్‌కుమార్, ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, తహశీల్దార్ వెంకటేశం, డీటీ దేవా, శ్రీనివాస్, ఏడీఏ పరుశరామ్, ఏఈఓలు ఎం సంధ్య, వెంకటేష్, సొసైటీ కార్యదర్శి ఎం రణదీర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ముమ్మరం



**ప్రజాపక్షం/రేగోడు :** వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే డంపింగ్ చేయాలని తాసిల్దార్ బాల లక్ష్మి ఆదేశించారు. మంగళవారం రేగోడు కోత్వన్‌పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్ద వడ్లు ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. లారీలు లేక పోవడం వల్లే ధాన్యం నిలిచిపోతుందని, తెలపడంతో లారీల కొరత తీర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేగోడు రైస్ మిల్ కు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనాలపై సంతృప్తి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలో మంగళవారం రోజున మెదక్ జిల్లా డిఎల్‌పిఓ సతీష్ కుమార్ నందిగామ గ్రామంలో సందర్శించడం జరిగింది. గ్రామంలోని హరితహారాన్ని, నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని తెలంగాణ క్రీడ ప్రాంగణాన్ని, వైకుంఠధామాన్ని, సెగ్రిగేషన్ షెడ్, గ్రామ పంచాయతీ సంబంధించిన అధికారులను పరిశీలించడం జరిగింది. గ్రామ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత, గ్రామ పరిస్థితి కార్మికులు నర్సరీ నిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.409 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం : భారతీహోళికేరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను అధికమించేల చర్యలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతీ హోళీకేరి జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి కలెక్టర్లతో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు తీరును పరిశీలించారు. జిల్లాలో 10 రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు ఇంకా రావాల్సిన ధాన్యంపై జిల్లా వ్యవసాయాధికారి పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. అలాగే సిఎంఆర్ డెలివరీపై సమీక్షించి రైస్‌మిల్లర్లందరు తమ కెపాసిటి ప్రకారం మిల్లింగ్ చేసి, ఎఫ్‌సిఐకి పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్‌మిల్లులతో స్థల సమస్య ఉన్నచో అందుబాటులో ఉన్న ఎఎంసి గోడౌన్లను వాడుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్ ప్రాం తంలో కొనుగోలు కేంద్రాలు తుదిదశకు వచ్చిందని, అక్కడ వాహనాలు కూడ ప్రస్తుతం ప్రస్తుతం అధిక ధాన్యం కొనుగోలు చేసేలా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. అలాగే దుబ్బాక మండలం హబ్షిపూర్ కేంద్రాన్ని, సిద్దిపేట జిల్లా ఇర్కోడ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఏమైన సమస్యలున్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తాలు ధాన్యం శుద్ధి చేసిన తర్వాతనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 50.953 రైతుల నుండి 2.23.198 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.491 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.409 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారితనుజ, మేనేజర్ హరీష్, డిఆర్‌డిఓ జయదేవ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వ్యవసాయాధికారి శివప్రసాద్, జిల్లా రవాణాధికారి వేణు, లీగల్‌మెట్రాలజీ అధికారి, రైస్‌మిల్లర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే సత్ఫలితాలు

హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి :** ఈనెల 27ననిర్వహించేవరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో విధులు నిర్వహించే నోడల్ అధికారులు, పోలీసులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికల్లో 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇందు కోసం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉప ఎన్నికలు సక్రమంగా నిర్వహించటంలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓల విదులు చాలా కీలకమన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలో పీఓలు,ఏపీఓలు, ఓపీఓలు ఎన్నికల నియమ నిబంధనల మేరకు తూచా తప్పక విదులునిర్వహించాలని, పట్టభద్రుల ఉప ఎన్నికను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బంధీగా, ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌ను ఓటరుకు ఇచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటర్లు ఓటుహక్కు వినియోగంలో పోలింగ్ సిబ్బంది ఇచ్చిన వాయిలెట్ కలర్ స్కెచ్ పెన్‌తో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎదురుగా క్రమ సంఖ్య వేయాలన్నారు. ఓటరు ఓటువేసే వ్యక్తి పేరు పక్కన 1 నుంచి నంబర్లు వేయాలని, నంబర్లు వేయకపోతే ఓటు చెల్లుబాటు కాదన్నారు. పీఓ ఇచ్చిన వాయిలెట్ పెన్ కాకుండా ఇతర రంగుల పెన్నులు వాడితో బ్యాలెట్ చెల్లుబాటు కాదన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో పీఓతో పాటు ఏపీఓ, ఓపీఓ ఉంటారన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సాధారణ ఎన్నికల మాదిరి మాక్ పోలింగ్ ఉండదని, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ ఓపెన్ చేసి చూపాలని, బాక్స్ మొత్తం ఖాళీగా ఉండాలని తెలిపారు. టెండర్, ఛాలెంజ్ ఓట్లు వేస్తే పీఓ ప్రత్యేక ఎన్వలప్‌లో భద్రపర్చాలని ఆ వివరాలు పీఓ డైరీలో నమోదుచేయాలన్నారు. ఓటరుకు ఎడమ చేతి మధ్య వేలుకు ఇండిబుల్ ఇంక్ పెట్టాలన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలకు విధులు కేటాయించిన సిబ్బందికిఓటుహక్కువినియోగానికి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న హన్మకొండ కెడిసిలో మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని అదే రోజు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మరుసటి రోజు పోలింగ్ ప్రక్రియకుఏర్పాట్లుచేయాలన్నారు.

## టి-20 జట్టు ఎంపిక

**ప్రజాపక్షం/మహబూబాబాద్ప్రతినిధి:**వరంగల్ లో జరకాబోయే ఎం.జయప్రకాశ్ మెమోరియల్ సీనియర్ ఇంటర్ డిస్టిక్ టి20 నాకౌట్ ఓపెన్ టోర్నమెంట్ కు మహబూబాబాద్ జట్టును అసోసియేషన్ ఇంచార్జ్ బి అజయ్ సారధి రెడ్డి ప్రకటించారు. ప్రకటించిన వారిలో 1 బి చరిత్ రెడ్డి (మహబూబాబాద్) 2 ఏ అనిర్వేశ్ (మహబూబాబాద్) 3 ప్రణయ్ కుమార్ (అమ్మాపురం) 4 బోడ శివ (తాట్య తండా) 5 శశి (అమ్మపురం )6 సాయి (ఇనుగుర్తి ) 7 రోషన్ (మహబూబాబాద్ ) 8 ప్రణయ్ గౌడ్ ( అప్ రాజ్ పల్లి )9 షరీఫ్ (కందికొండ )10 యశ్వంత్ (కేసముద్రం) 11 రాకీబ్ (మహబూబాబాద్ )12 రిషి వరుణ్ (కేసముద్రం) 13 అజయ్ (కేసముద్రం) 14తరుణ్ (అమ్మాపురం) 15 వంశీ (వావిలాల) 16 శ్రీరామ్ (మహబూబాబాద్) 16 శ్రీరామ్ (మహబూబాబాద్) 17 రాకేష్ (వీరారం తండా) 17 మంది తో మహబూబాబాద్ క్రికెట్ జట్టు ఆడనున్నట్టు బి.అజయ్ సారధి రెడ్డి తెలిపారు. మ్యాచ్ లకు కోచ్ లుగా మెతుకు కుమార్ తోట వినయ్, సహాయకుడిగా అయిలి సంతోష్ పాల్గొంటారని తెలిపారు.

## రైతుల్ని మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వాల్సిందే

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేయడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని రైతు బంధు సమితీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 24 గంటల విద్యుత్, రైతు బంధు ఇవ్వకపోగా ఇప్పుడు సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని రేవంత్‌రెడ్డి మాటమార్చడం సరియైంది కాదని పల్లా మండిపడ్డారు. మంగళవారం జనగామలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2014 ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణలో వరి పంట సాగు గణనీయంగా పెరిగిందన్నారు. ప్రతి ఏటా 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చేయడే కాకుండా సకాలంలో రైతు బంధు,రైతు భీమా అందించామన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలు డిసెంబర్ 9 వరకు రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందని ఆశించగా ప్రభుత్వం ఏర్పడిని వంద రోజుల్లో కూడా ఆశ నిరాశగానే మిగిలిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టులో రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం కార్పొరేషన్ వేస్తామని చెబుతుందని, కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ఎఫ్‌ఆర్‌బిసి నిబంధల ప్రకారం నిధులు రావనే విషయం అధికారులు, ప్రభుత్వానికి తెలియదాఅని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఏర్పాటు రైతుల్ని మోసం చేయడానికే అని మండిపడ్డారు. తెలంగాణలో సన్న ధాన్యం దిగుబడి తక్కువగా ఉంటుందని, బార్డర్ ప్రాంతాల్లోనే సాగు జరుగుతుందన్నారు. అయినా సన్న ధాన్యాన్ని వ్యాపారులే 3వేలకు పైగా కొనుగోలు చేస్తుంటే మీరిచ్చే బోనస్ ఏం ఉపయోగపడుతుందనిమండిపడ్డారు.గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ఒక వైపు స్వచ్ఛమైన అభ్యర్థి ఎనుగుల రాకేష్‌రెడ్డి ఉంటే మరో వైపు 51 కేసులు 76 రోజులు జైల్లో ఉన్న వ్యక్తి తీన్మార్‌మల్లన్న ఉన్నారన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు చేసే ఎనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.మున్సిపల్ ఛైర్ పర్సన్ పోకల జమున, మార్కెట్ మాజీ ఛైర్మన్ బాల్నె సిద్దిలింగం, మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, పసుల ఎబెల్, యాదవరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణలో అధికారులే కీలకం

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈ నెల 27 న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాలులో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నికలో విధులు నిర్వహించు నోడల్ అధికారులు, పోలీస్, పిఓలు, ఎపివోలు, ఓపిఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విధులు నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 న నిర్వహించే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉపఎన్నిక పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పట్టభద్రుల ఉపఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 12,535 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందు కొరకు 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందనితెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్ సక్రమంగా నిర్వహించుటలో పిఓలు, ఏపిఓలు, ఓపిఓల విధులు చాలా కీలకమని అన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలో 19 మంది పీఓలు, 19 మంది ఏపిఓలు, 38 మంది ఒపిఓలకు విధులు కేటాయించామన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శిక్షణ నోడల్ అధికారులు అవినాష్, శామ్యూల్, ఆర్డీవో మంగిలాల్, డీఎస్పీ సంపత్‌రావు పాల్గొన్నారు.

## మోసపూరిత మాటలతో రైతన్న ఆగమాగం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/తొర్రూరు :** అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు రుణమాఫీ చేస్తామని, పండిన పంటలకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలతో రైతులను ఆగం చేస్తుందని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రెండు పంటలు పండేలా కేసీఆర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. రైతులకళ్లల్లో ఆనందంచూడాలన్నదే కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే డిసెంబర్ 9న రూ.రెండు లక్షల రుణమాఫీ అవుతుందని, పండించిన వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసే బాధ్యత మాది అని చెప్పి రేవంత్‌రెడ్డి నిన్న జరిగిన కేబినేట్ సమావేశం తరువాత సన్న వడ్లు పండించిన వారికి మాత్రమే రూ.500లు బోనస్ ఇస్తామన్న ప్రకటనతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్లు వడ్లు మాత్రమే సాగు చేస్తారని, కేవలం పది శాతం మంది మాత్రమే వారి కుటుంబ అవసరాల కోసం ఉంచుకొని మిగిలింది అమ్ముకునే వారని చెప్పారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి తెలంగాణలో అధిక శాతం దొడ్లు వడ్లే పండుతాయని, దొడ్డు వడ్లకు మద్దతు ధర ఇవ్వాలని అన్నాడని, ఇప్పుడు అధికారంలోకి రాగానే సన్న వడ్లకు మాత్రమే మద్దతు ధర ఇస్తామని అనడం బోగస్ మాటలకు నిదర్శనమన్నారు.

## వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశం కోసం జరిగిన ఈసెట్ 2024 పరీక్షలో ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి 10ర్యాంకులలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 3, 4, 9 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 1, 2, 5, 6, 7 ర్యాంకులు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో 2, 4 ర్యాంకులు, మెకానికల్ ఇంజనీరింగ్ లో 2,6,10 ర్యాంకులు కైవసం చేసుకొని ప్రభంజనం సృష్టించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎన్. దీక్షిత్ 3వ ర్యాంక్, పి.వివేక్ 4వ ర్యాంక్, బి.హేమాశ్రీ 9వ ర్యాంక్, పి.నాగ సాయి యశ్వంత్ 19వ ర్యాంక్ సాధించగ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో రాష్ట్ర స్థాయిలో ఎం.నవ్య శ్రీ 1వ ర్యాంక్, వి.వైష్ణవ్ 2వ ర్యాంక్, వి.అర్పిత 5వ ర్యాంక్, కె.హర్షిత 6వ ర్యాంక్, పి.హారిక 7వ ర్యాంక్, ఎండీ.సోహైల్ 11వ ర్యాంక్ సాధించగ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో టి.శ్రీవాత్సవ్ 2వ ర్యాంక్, ఎం.కౌశిక్ కుమార్ 4వ ర్యాంక్ సాధించగ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో కె.చందు 2వ ర్యాంక్, కె.అఖిల్ 6వ ర్యాంక్, బి.నిఖిల్ 10వ ర్యాంక్, ఓ.గౌతమ్ 12వ ర్యాంక్ సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు, కళాశాల విభాగ అధిపతులను, అధ్యాపకులను ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్ డా॥ బైరి ప్రభాకర్ అభినందించారు.

## క్రికెట్ స్టేడియం కోసం వినతి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** హైదరాబాద్ తర్వాత అతిపెద్ద తెలంగాణ రెండవ రాజధానిగా పిలవబడే పాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా క్రికెట్ స్టేడియం కోసం స్థలం చూసి నిర్మాణానికి సహకరించాలని వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యుడిసిఏ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబాబాద్ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జ్ బి.అజయ్ సారదిరెడ్డి కోరారు. వరంగల్ లో జరిగిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపుల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావుకు వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యుడిసిఏ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబాబాద్ సమ్మర్‌క్రికెట్ కోచింగ్ క్యాంప్ ఇంచార్జ్ బి.అజయ్ సారదిరెడ్డి పలు క్రికెట్ సంబంధిత సమస్యలను దృష్టికి తెచ్చి ప్రస్తావించారు. గతంలో కాజీపేట జక్కలొద్దీలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తామని గతంలో హెచ్సీఏ పెద్దలు చెప్పారని గుర్తు చేశారు. అన్ని విధాల వెనుకబడిన హైదరాబాద్ యేతర వరంగల్ తోపాటు తొమ్మిది జిల్లాల క్రికెట్ అసోసియేషన్లకు అన్ని విధాల మౌలిక వసతులతో పాటు అసోసియేషన్ ల బలోపేతం చేయాలని క్రీడాకారులకు వివిధ లీగ్ రంజీ టోర్నమెంట్లలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమ్మర్ క్యాంపు ల ద్వారా తెలంగాణ వ్యాప్తంగా పాల్గొన్న క్రీడాకారుల వారి తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా ఉండేలా హెచ్సీఏ హైదరాబాదులో జరిగే ఐపీఎల్ టి20 వన్డే టెస్ట్ మ్యాచ్ ల ఏదో సందర్భంగా వీక్షించే అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ తోపాటు కొత్త జిల్లాలకు హెచ్సీఏ గుర్తింపు ఇవ్వాలని కోరారు. స్పందించిన హెచ్సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ వరంగల్లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని, ఐపీఎల్ ఇతర అంతర్జాతీయ మ్యాచ్లకు వెయ్యి మంది వీక్షించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి ఏ డబ్ల్యూడిసిఏ పెద్దలతోపాటు మెతుకు కుమార్, తోట వినయ్, అయిలి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధూల్మిట్టలో రేణుకాఎల్లమ్మ పండుగ



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలలో గౌడ కులస్థులు జరుపుకునే రేణుకాఎల్లమ్మ తల్లి పండుగ ఒక్కటి. చారిత్రాత్మక గ్రామం ధూల్మిట్ట మండల కేంద్రంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో '' రేణుకా ఎల్లమ్మ తల్లి పండుగ వేడుకలు'' కనుల పండుగగా నిర్వహించారు. ధూల్మిట్ట గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మొట్ట మొదటి సారి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని జరుగుతున్న బోనాల పండుగతో మంగళవారం గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలు, జల్దీబోనాలతో గౌడ కులస్థులు మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రజలు, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని నిర్వహిస్తున్న పండుగను, గ్రామస్తులందరితో పాటుగా, గ్రామ ప్రముఖులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండుగలో పలువురు మండల ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలు మంగళ హారతులతో నిరాజనాలు పలుకుతూ, రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి తొలి బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈ అద్భుతమైన ఘట్టంలో గ్రామంలోని వివిధ కులకులసంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, విద్యావేత్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గోన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామం, మండలం సుభిక్షంగా ఉండాలని, ప్రతిఒక్క ఇంటిల్లి పాదిని చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరిని ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఆ రేణుకా ఎల్లమ్మ తల్లిని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు.

## 'ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలి'

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** మిల్లుల వద్ద దాన్యం త్వరగా అన్‌లోడ్ చేయించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సివిల్ సప్లై అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ మంగళ వారం అందోల్ డివిజన్‌లోని మన్సాన్ పల్లి, కన్సాన్ పల్లి గ్రామాలల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ, మార్పుల కనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంబించాలని, తెలిపారు. రోజు ఐదు లారీలకు తక్కువ కాకుండా కొనుగోలు కేంద్రాలకుఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆకాల వర్షాలు పడుతున్నందున వేగవంతం కొనుగోలు చేసిన దాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జీకి సూచనలు జారీ చేశారు. గన్నీ బ్యాగ్ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు. మిల్లుకు ఇచ్చిన కెపాసీటీని పూర్తి చేయాలని రైతుల నుండి కొనుగోళ్లకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని మిల్లులలో స్పేస్ పెంచుకొని దాన్యం లారీలను త్వరగా ఆన్ లోడ్ చేయించాలని, ఆ వెంటనే ఆన్ లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంల సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ కొండల్‌రావు, జిల్లా పౌర సరఫరాల అదికారి వనజాత, మోప్మా, పిడి గీత ఆర్డీఓ పాండు సంబందిత అదికారులు రైతులు పాల్గొన్నారు.

## విధులు నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు ఖాయం

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాఫక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అదికారులకు షోకాజ్ నోటీసులుఅందజేస్తామనిజిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనుల పురోగత సరిగా లేనందున విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా హెచ్ ఏం లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అదికారికి ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారుల పై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మంగళ వారం అందోల్ డివిజన్ లోని జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌళిక వసతులు కల్పన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మౌళిక వసతుల కల్పన అభివృద్ధి పనులు దగ్గర ఉండి చేయించుకునే భాద్యత ప్రధాన ఉపాధ్యాయులదేనని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని విద్యా శాఖ అధికారులను ఈఈపి ఆర ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఈఈసిఆర్ అంజయ్య ఆర్‌డిఓ రాజు ఎంఇఓ కృష్ణయ్య ఏంపిలు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై దాడులు



**ప్రజాపక్షం/రఘునాథ-పల్లి:** ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నా ఇసుకాసురుల ధన దాహానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని రఘునాథపల్లి, నిడిగొండ , బాణాజిపేట, శ్రీమన్నారాయణపురం, ఖిలాషాపురం, మండెలగూడెం, వెల్ది గ్రామాల శివారు వాగుల నుండి ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు. టిప్పర్లను, ట్రాక్టర్లను ఎవరు ఆపలేరనే ధీమాతో అక్రమార్కులు ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలో ఇసుక మాఫియా చీకటి పడిందంటే చాటు ఆయా గ్రామాల్లోని వాగులో నుండి రాత్రి 11 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు జేసీబీలు, డోజర్‌ల సహాయంతో ఇసుకను తోడేస్తూ లక్షలు గడిస్తున్నారు ఇసుకాసురులు. దీంతో వారిపై పోలీసులు గత రెండు రోజులుగా దాడులు చేస్తూ ట్రాక్టర్లను సీజ్ చేస్తూ, కేసులు నమోదు చేస్తున్నారు. దీనిలో భాగంగానే గత రాత్రి ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పర్వత సుమన్ అక్రమంగా ఇసుకను రఘునాథపల్లి గ్రామశివారులో గల కాండ్ల వాగు నుండి తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడం జరిగింది. అదేవిధంగా మండెలగూడెం గ్రామానికి చెందిన చింతకాయల నరేష్ సైతం అనుమతులు లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసు నమోదుచేశారు. ఎవరైనా మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే దాడులు తప్పవని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు.

